మహబూబ్‌నగర్

వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

## నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట, మే 9 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామ సమాఖ్య (ఐకేపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరి కొనుగోలు కేంద్రాలలో లావాదేవీలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు కేంద్రానికి ఎన్ని ధాన్యం బస్తాలు వచ్చాయో, గత ఏడాది ఎంత మేరకు ధాన్యం కొనుగోలు చేశారో నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు, విక్రయానికి రానున్న ధాన్యం వివరాలను నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. కేంద్రంలో గన్నీ బస్తాల నిల్వలను పరిశీలించిన ఆమె, అవసరమైన రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అలాగే రైతులతో మాట్లాడి కేంద్రానికి ఎప్పుడు వచ్చారని, ధాన్యంలో తేమ శాతం పరిశీలించారా లేదా అని ఆరా తీశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి బాల్‌రాజ్, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, డీటీలు కాళప్ప, నాగరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్యదర్శిపై వేటు

## జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తాత్కాలిక సస్పెన్షన్

## జడ్చర్ల మార్కెట్‌లో కొత్త ఇంచార్జ్ నియామకం

**జడ్చర్ల, మే 9, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లాలో రబీ 2025, 26 మొక్కజొన్న సేకరణ వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. జడ్చర్ల మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనుగోళ్లలో జరిగిన అవకతవకలు,నిర్లక్ష్యంపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో పిఎసిఎస్ బాదేపల్లి లిమిటెడ్ కార్యదర్శి యాదగిరిపై జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త చర్యలు తీసుకున్నారు. మొక్కజొన్న సేకరణ విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం జరిగినట్లు ఆరోపణలు రావడంతో, ఆయనను తాత్కాలికంగా విధుల నుండి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సంయుక్త రిజిస్ట్రార్ / జిల్లా సహకార అధికారి డి. కృష్ణ మెమోరాండం విడుదల చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇకపై జడ్చర్ల మార్కెట్‌లో పిఎసిఎస్ బాదేపల్లి లిమిటెడ్ తరపున మొక్కజొన్న సేకరణ బాధ్యతలను పిఎసిఎస్ భూత్‌పూర్ లిమిటెడ్ స్టాఫ్ అసిస్టెంట్ ఆర్. వెంకటేష్‌కు అప్పగించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయనే ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు. రైతులు మార్కెట్‌లో రోజుల తరబడి వేచి ఉండాల్సి రావడం, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, తూకాల్లో గందరగోళం, సరైన స్పందన లేకపోవడం వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సహకార శాఖ ఒక్కసారిగా అప్రమత్తమై, కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే ఎంతటి అధికారిపైనా చర్యలు తప్పవని ఈ ఘటనతో స్పష్టమైన సంకేతాలు వెళ్లాయి.



రోడ్డుపై ధాన్యం ఆరబోసిన దృశ్యం

# రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు

## రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ

## రైతులు ప్రభుత్వం సూచించిన నిర్దిష్ట కల్లాల్లోనే ధాన్యం ఆరబోసుకోవాలి : డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్, మే 9 ప్రభాతవార్త :** రోడ్లపై దాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. జిల్లా ఎస్పీ డి.జానకీ ధరావత్ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో కొంతమంది రైతులు, వ్యాపారులు రహదారులపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం సరిగా కనిపించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో రహదారులపై ధాన్యం ఆరబోసి రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిర్దిష్ట కల్లాల్లో లేదా వ్యవసాయ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే ఆరబోసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ కోరారు.



మారథాన్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అధికారులు విద్యార్థులు

# స్వీయ గణనపై ప్రజలకు అవగాహన కల్పించాలి

## సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, మే 9, ప్రభాతవార్త :** జనగణన 2027లో భాగంగా ప్రజలు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) ద్వారా తమ వివరాలను తామే నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జనగణన 2027లో భాగంగా స్వీయ గణనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన మారథాన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. బాలుర జూనియర్ కళాశాల మైదానం నుండి ప్రారంభమైన మారథాన్ పాలిటెక్నిక్ కళాశాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరోనా కారణంగా 2021 లో నిర్వహించాల్సిన జనగణన ప్రక్రియ ఆలస్యమైందని, ఇప్పుడు దేశవ్యాప్తంగా -మిగతా2లో..

# సులభంగా.. పారదర్శకంగా..

## స్వీయ గణన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

## జన గణన 2027 స్వీయ గణన ద్వారా వివరాలు నమోదు చేసుకున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



వివరాలు నమోదు చేస్తున్న కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్‌గర్ బ్యూరో మే 9 ప్రభాతవార్త :** జన గణన 2027 లో భాగంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శనివారం తన క్యాంపు కార్యాలయంలో స్వీయ గణన లో పాల్గొని లాప్ టాప్ ద్వారా వివరాలు నమోదు చేసుకున్నారు. జన గణనలో ఎవరికి వారు స్వయంగా వివరాలు నమోదు చేసుకునేలా అందుబాటులోకి తెచ్చిన ఆన్ లైన్ వెబ్ సైట్ హెచ్‌టిటిపిఎస్ //ఎస్.ఇ.సెన్సస్.జిఓవి.ఇన్ ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జన గణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన (డిజిటల్ సెల్ఫ్ ఎన్యుమరేషన్) విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఆన్లైన్ ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను వెబ్ పోర్టల్‌లో కానీ, మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. మే 10వ తేదీ వరకు స్వీయ గణన చేసుకునేందుకు అవకాశం ఉందని, స్వీయ గణన ప్రతి ఒక్కరూ పాల్గొని వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. జన గణనకు సంబంధించిన సమాచారాన్ని 15 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసుకోవచ్చని అన్నారు. వివరాలు నమోదు చేసిన అనంతరం ప్రత్యేకమైన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి (ఎస్ఇఐడి) జారీ చేయబడుతుందని తెలిపారు. ప్రభుత్వంచే నియమించబడిన ఫీల్డ్ ఎన్యుమరేటర్లు మే 11 నుంచి జూన్ 09వ తేదీ మధ్యకాలంలో క్షేత్రస్థాయిలో ఇంటికి వచ్చిన సమయంలో వారికి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి నెంబర్ తెలియజేయాలని సూచించారు. ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సమాచారాన్ని సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి ద్వారా ఎన్యూమరేటర్ పరిశీలించి ధృవీకరిస్తారని అన్నారు. దీనివల్ల ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండే వారు, విద్యార్థులు, వలస కార్మికులు, ప్రయాణాల్లో ఉన్న ప్రజలు కూడా జనగణనలో వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. అయితే, స్వీయ గణనలో ఖచ్చితమైన చిరునామా, సరైన వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. జనగణన ప్రక్రియలో సాంకేతికతను వినియోగించి సమగ్రతను పెంచడం, ప్రతి పౌరుడి వివరాలు జన గణనలో చేరేలా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను జిల్లాలోని ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా కల్పించారు. దేశ అభివృద్ధి ,ప్రణాళికల రూపకల్పనలో ఎంతగానో దోహదపడే జన గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతం అయ్యేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

# వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా విద్యా వారోత్సవాలు విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, మే 9, ప్రభాతవార్త :** జిల్లాలో రబీ సీజన్ కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లు, జనగణన సెల్ఫ్ ఎన్యుమరేషన్, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యాశాఖ వారోత్సవాలు సహా పలు అంశాలపై హైదరాబాదు నుంచి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ హాజరయ్యారు. సిఎస్ మాట్లాడుతూ జనగణన 2027లో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి అత్యధిక శాతం ప్రజలు, ప్రభుత్వ సిబ్బంది అందులో పాల్గొని తమ వివరాలను నమోదు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాల వారీగా స్వీయ జనగణనపై సమీక్షించిన సిఎస్ ప్రభుత్వ అధికారులు సిబ్బంది అందరూ స్వీయ గణన చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా అన్నిజిల్లాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి వేగవంతం చేయాలని, త్వరగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ 100 ఆదేశించారు. రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మే 11వ తేదీ నుంచి 17వ తేదీ -మిగతా4లో..

# ధాన్యం రవాణా టెండర్లలో భారీ స్కాం

## కొనుగోలు సరే.. రవాణా చేయడానికి వాహనాలేవీ?

## ట్రాన్స్ పోర్ట్ వాహనాల కాంట్రాక్టర్ల చేతివాటం... ఇందులో అధికారుల వాటా ఎంత?

## రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదు

## బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్





మాట్లాడుతున్న రాచాల యుగంధర్ గౌడ్

**పెబ్బేరు, మే 9 ప్రభాతవార్త :** ధాన్యం రవాణా టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందని, ప్రభుత్వం వెంటనే దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా.రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రారంభమై 15 రోజులైనా ధాన్యం కొనడం లేదని రైతులు రోడ్డెక్కుతుంటే.. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతి గింజ కొంటాం అని చెబుతుంటే... ప్రతి పక్షం ధాన్యం కొనుగోలు చేయడం లేదని అంటోందన్నారు. వీటన్నింటి మధ్య ధాన్యం రవాణా చేసే వాహనాల టెండర్లలో భారీ స్కాం జరిగినా ఎవరూ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఏటా ధాన్యం రవాణా చేయడానికి వాహనాలకు టెండర్లు నిర్వహించిన మాదిరిగానే ఈసారికూడా జిల్లా వ్యాప్తంగా 9 సెక్టార్లు ఏర్పాటు చేసి. టెండర్లు నిర్వహించి ఒక్కో సెక్టారులో 14 - 16 టైర్లు గల 40 లారీలను అంటే మొత్తం 360 లారీలను ఎంపిక చేశారు. ఇదంతా అధికారులను నమ్మించడానికి కాంట్రాక్టర్లను పేపర్లలో మాత్రమే చూపించి అక్రమంగా టెండర్లు దక్కించుకున్నారని ఆరోపించారు. కాని ఫీల్డులో వారు చూపించిన ఒక్క లారీ కూడా -మిగతా4లో..



రైతులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించి మద్దతు తెలుపుతున్న మాజీ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి

# మాజీ మంత్రి చొరవతో రైతులకు ఊరట

## మార్కెట్లో ధాన్యం దిగుమతికి అంగీకారం

## జడ్చర్లలో రైతులకు మాజీ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి మద్దతు

# అనుమానాస్పద స్థితిలో దంపతుల ఆత్మహత్య

## ఆరోగ్య సమస్యలా..? ఆర్థిక ఇబ్బందులా?

## మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో విషాదం



శేఖర్, వరాలు (ఫైల్)

**జడ్చర్ల,మే 9, ప్రభాతవార్త :** భార్యాభర్తలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మహ బూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల మున్సిపాలిటీలో ని 24వ వార్డు విజయనగర్ కాలనీలో దంపతులు ఆకుతోట శేఖర్ (56 ) వరాలు (49 ) ఇంట్లో పడుకున్న చోటే విగత జీ వులుగా పడిఉండడం చూసి స్థానికులు షాక్‌కు గురయ్యారు. శేఖర్ జడ్చర్లలో బియ్యం వ్యాపా రంతో పాటు చీటీల ఏజెంట్‌గా కూడా వ్యవహరించే వారు. కొంతకాలంగా తన భార్య వరాలు అనారోగ్యంతో బాధపడుతుండగా శేఖర్ కూడా ఎక్కువగా బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నట్లు స్థానికు లు చెప్పారు. తెల్లవారినా తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన కుమారుడు కిటికీ ద్వారా చూడగా ఇద్దరు విగత జీవులుగా పడి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐలు మల్లేష్ జయప్రద ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలా ఇతర ఏవైనా ఆర్థిక సమస్యలు ఉన్నాయా లేదా కుటుంబ సమస్యలు ఉన్నాయా అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో డాక్టర్ విజయ్‌కుమార్ మృతి



డాక్టర్ విజయ్‌కుమార్ (ఫైల్)

**కల్వకుర్తి, మే 09 ప్రభాతవార్త:** జడ్చర్ల-కోదాడ ప్రధాన రహదారిపై కల్వకుర్తి సమీపంలోని సీబీఎం కళాశాల వద్ద శనివారం ఉదయం 7 గంటలకు చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ప్రముఖ వైద్యులు గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ్‌కుమార్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాల మేరకు... అక్షరవనంలో డాక్టర్ విజయ్‌కుమార్ ప్రతి రోజు ఉదయం షెటిల్ బ్యాడ్మింటిన్ ఆడే వారు. రోజు లాగానే షెటిల్ ఆడి కల్వకుర్తికి తన కారులో వస్తున్న సందర్భంగా ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో డాక్టర్ విజయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108లో కల్వకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తుంగా మృతి చెందినట్లు -మిగతా4లో..

# రూ.480కోట్లతో లైనింగ్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు

## ఇరిగేషన్ డివిజన్ అధికారి మాణిక్ ప్రభు



సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ డివిజన్ అధికారి మాణిక్ ప్రభు

**ఉప్పునుంతల, మే 9 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు వారం కార్యక్రమంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి చిన్న నీటి పారుదల శాఖ డివిజన్ అధికారి మాణిక్ ప్రభు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 నుంచి ఇప్పటివరకు మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద అందిస్తున్న సాగునీరు మండలంలో అచ్చంపేట ప్యాకేజీ నెంబర్ 30 లో 20 వేల 423 ఎకరాలకు సాగునీరు అందిండం జరుగుతుందని వివరించారు. మరో పులిజాల నుంచి సింగారం వరకు విస్తరిస్తున్న ఎంజిఎల్ఐ కాల్వ ద్వారా మండలంలో మరో 15 రకాల కు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద కాల్వల ద్వారా అందుతున్న సాగు నీరు వృధా కాకుండా కాల్వలు దెబ్బతిన్నకుండా ఉండేందుకు రూ.480 కోట్ల తో లైనింగ్ పనులు చేపట్టెందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించడం జరిగిందని ఇరిగేషన్ డివిజన్ అధికారి మాణిక్ ప్రభు వివరించారు. మండలంలో 81 చెరువు, కుంటల్లో పూడిక తీత పనులు చేపట్టడానికి అవకాశం ఉన్నప్పటికీ నీళ్లు ఉండడంతో ఎక్కడ పూడిక తీత పనులు చేపట్టడానికి అవకాశం లేదన్నారు. బల్మూరు మండలంలో చేపడుతున్న శ్రీ ఉమా మహేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ కింద ప్రాజెక్టు పనులు పూర్తి అవుతే మండలంలో మరో 15 50 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఉన్న కాల్వ లో ఉపాధి హామీ పథకం కింద చిన్న చిన్న మొక్కలు తొలగించాలని, ఈజీఎస్ ఏపీఓ ప్రత్యేక దృష్టి సారించాలని డిఇ పేర్కొన్నారు. గత 10 సంవత్సరాల నుంచి కాల్వల ద్వారా సాగు నీరు అందుతున్న కొన్ని ప్రాంతాలలో కాల్వ లు తెగి దిగువన ఉన్న పంట పొలాలు దెబ్బతింటున్నాయని, దెబ్బతిన్న ప్రాంతంలో సీసీ నిర్మాణం చేపట్టే పంట పొలాలు దెబ్బ తినే అవకాశం ఉండదని గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు సమావేశంలో సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని డిఇ వివరించారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఉన్న కాలువలో ఉన్న పెద్ద పెద్ద చెట్లను తొలగించేందుకు ఇరిగేషన్ అధికారులు యంత్రాల ద్వారా తొలగించడం జరుగుతుందని, అలా కాలువల్లో పెద్ద చెట్లు ఎక్కడ ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని డిఇ పేర్కొన్నారు. చెరువు, కుంటల్లో నీరు లేకుండా ఉన్న చెరువు, కుంటల్లో పూడిక తీత పనులు చేపట్టడానికి అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పథకం మీద ఇరిగేషన్ శాఖ కింద 35 పనులకు గాను 11 పనులు మంజూరు అయ్యాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని డిఇ రైతులకు సూచించారు. చిన్న సన్న కారు రైతులు పండ్ల తోటల పెంపకం చేపడితే ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై పథకాలు అందుతాయని వాటిని రైతులు సద్వినియోగ పర్చుకోవాలని ఉపాధి హామీ పథకం ఈసి కుర్మారెడ్డి వివరించారు. మండల కేంద్రంలో ఉన్న పోలేను చెరువు కు బాట సౌకర్యం కల్పించాలని మత్స్యకారులు చెరువులకు వెళ్లడానికి రహదారి లేకుండా చేశారని సత్వరమే విచారణ జరపాలని మత్స్యకార సోదరులు కోరారు. గత కొన్ని ఏళ్ల తరబడి నుంచి పోలేను చెరువు వద్ద కర్మకాండ కార్యక్రమాలు నిర్వహించే వాళ్ళమని ప్రస్తుతం చెరువు కు వెళ్లడానికి దారి లేకుండా చేశారని వీటిపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సమావేశంలో మత్స్యకారులు, రైతులు కోరారు. వారికి సమాధానం ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని రైతులకు వివరించారు. ఈ సమావేశానికి ముందు తెలంగాణ జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సమావేశంలో అచ్చంపేట డివిజన్ ఇరిగేషన్ డివిజన్ అధికారి మాణిక్ ప్రభు, గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్, స్థానిక ఇరిగేషన్ ఎఇ అలివేల,పిఎసిఎస్ సి ఈ ఓ కొత్త రవీందర్ రావు, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, మండల విస్తీర్ణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అవినీతికి సహకరిస్తున్న అధికారులు

**మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి**



ఇసుక రీచ్ వద్ద అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**మాగనూర్, మే 9 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఖజానాకు గండిపడేలా అవినీతికి అధికారులు సహకరి స్తున్నారని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాగనూర్ మండల కేంద్రం వాగులో రాఘవ కన్స్ట్రక్షన్‌కు సంబంధించిన ఇసుక రీచ్ దగ్గరకు వెళ్లారు. రెండవ శనివారం ప్రభుత్వ సెలవుదినంరోజు ఇసుక తవ్వేందుకు పర్మిషన్ ఇచ్చారా అని తహసిల్దార్‌ను ఫోన్లో వివరణ కోరారు. సెలవు దినం రోజుఎలాంటి పర్మిషన్లులేవని చెప్పినట్లు తెలిపారు. వాగులో ఉన్న హిటాచిపై కేసు నమోదుచేసి ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలని ఎస్పైను డిమాండ్ చేశారు. అధికారులు ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అవినీతి చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని అధికారులను కోరారు. ఈయన వెంట పిఎసిఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పల్లె మారెప్ప, అశోక్ గౌడ్, దండు సాయిబన్న, గజపతి, నవీన్ తో పాటు తదితరులు ఉన్నారు.

## బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి : సీఐ శివశంకర్



మాట్లాడుతున్న సిఐ శివశంకర్

**నారాయణపేట, మే 9 ప్రభాతవార్త :** బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని పేట సీఐ శివశంకర్ సూచించారు. బక్రీద్ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ పశువుల రవాణా నియంత్రణపై నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో ఖురేషి నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. పశువుల కొనుగోలు, రవాణా, వధ ప్రక్రియల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ తెలిపారు. రవాణా సమయంలో జంతువులకు సరైన సంరక్షణ కల్పించాలని, వాహనాల్లో అధిక సంఖ్యలో పశువులను తరలించరాదన్నారు. తనిఖీల సమయంలో పోలీస్, వెటర్నరీ, రవాణా శాఖ అధికారులకు సహకరించాలని సూచించారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా పశువుల రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి లేని ప్రదేశాల్లో జంతువుల వధ, బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు చేయరాదన్నారు. మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు షేర్ చేయడం నేరమని స్పష్టం చేశారు. అక్రమ పశువుల రవాణా, అనుమతులు లేని స్లాటర్ హౌస్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పండుగ సమయంలో సామరస్య వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు ఈ సమావేశంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, వెటర్నరీ డాక్టర్, ఎస్ఐ2 గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రంలో గన్ని బ్యాగుల సమస్యలు పరిష్కరించాలి

**లారీల కొరత లేకుండా చూడాలి ; సిపిఎం మండల కార్యదర్శి వెంకట రాములు**



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

**మదనాపురం,మే 9 ప్రభాతవార్త :** వరి ధాన్యంకొనుగోలు కేంద్రంలో గన్ని బ్యాగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఉన్నతాధికారులు డిఎం ఆంజనేయులు తహశీల్దార్ రాజుకు ఫోన్ చేసి సిపిఎం మండల కార్యదర్శి వెంకట రాములు కోరారు. శనివారం మండల కేంద్రంలో సిపిఎం నాయకులతో కలిసి పలు గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను వెళ్లి సందర్శించి రైతులతో ఎదుర్కొన్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం తూకం చేసిన 15 రోజులైనా లారీలను రాకపోవడంతో రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు గన్ని బ్యాగులు వెంటనే తీసుకొని కొనుగోలు కేంద్రంలో తూకం చేసిన 48 గంటల్లో మిల్లుకు తరలించాలని ఆయన కోరారు. మండల వ్యాప్తంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని తెలిపారు. వెంటనే రైతులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు చీర్ల ప్రసాద్, చంద్రాయుడు రైతులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్లబ్ కోఆప్షన్ సభ్యుడిగా భాను ప్రకాష్ యాదవ్



భానుప్రకాష్ యాదవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, మే 9 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్లబ్ కోఆప్షన్ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు భాను ప్రకాష్ యాదవ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో భాను ప్రకాష్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చలువగాలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వేలాదిగా తరలుదాం..

**మోడీ సభను విజయవంతం చేద్దాం**

**బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్**



**నాగర్ కర్నూల్, మే 9, ప్రభాతవార్త:** హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా ఆదివారం జరగనున్న ప్రధాని నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభకు ప్రతి పల్లె నుంచి వేలాదిగా తరలి రావాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఇటీవల విడుదలైన అసెంబ్లీ ఫలితాల్లో మూడు రాష్ట్రాల్లో బిజెపి విజయ దంకా మోగించి తెలంగాణలో అధికారం చేపట్టే దిశగా అడుగులు వేస్తున్న బిజెపి వెంట ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందుకు క్షేత్రస్థాయిలో ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని కోరారు. నేడు పరేడ్ గ్రౌండ్లో జరగనున్న మోడీ సభకు ప్రతి ఊరువాడ,పల్లె,పట్టణం నుంచి తరలివచ్చి ఆశీర్వదించాలని కోరారు.

## స్వీయ గణనపై ప్రజలకు అవగాహన కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి)



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

డిజిటల్ విధానంలో జనగణన చేపడుతు న్నట్లు తెలిపారు. మే 11 నుండి జూన్ 10 వరకు జిల్లాలో సుమారు 13 వేల మంది సిబ్బంది ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ కార్యక్రమంలో పాల్గొని వివరాలు సేకరిస్తారని చెప్పారు. ప్రజలు స్వీయ గణ న (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ద్వారా తమ వివరాలను తామే నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. సరైన సమాచారం ద్వారా అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. ప్రజల వివరాలు పథకాల నమోదులో ఎక్కడ వినియోగించడం జరగదని ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా తమ సమాచారాన్ని ఎన్యూమరేటర్లకు తెలియజేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జనగణన విజయవంతానికి మీడియా ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని, ప్రజలందరూ సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఎస్పి గిరిబాబు, సిపిఓ హరికృష్ణ, డివైఈ ఓ సుధీర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**నిరుపేదలకు సదవకాశం**

**మిడ్జిల్, లింబ్య తండాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పర్యటన**

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి పరిశీలన**



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మిడ్జిల్, మే 9, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన ప్రతి పేదవాడు ప్రభుత్వ సహాయంతో సొంత ఇంటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మిడ్జిల్ మండలంలోని మిడ్జిల్, లింబ్య తండాలో ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరై ఇంకా నిర్మాణ పనులు ప్రారంభించని కొంతమంది లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. ప్రభుత్వం ఇల్లు లేని పేద కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందించి ఇళ్లు కట్టుకునేందుకు మంచి అవకాశం కల్పించిందని, ప్రతి లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ముగ్గు పోసుకుని వెంటనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆయన సూచనలకు స్పందించిన గ్రామస్తులు తక్షణమే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఐకేపీ ద్వారా రుణ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల ఏపీఎంలకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో మంజూరైన ప్రతి ఇంటినిర్మాణం పూర్తయ్యేలా సర్పంచులు, వార్డు సభ్యులు,గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు మరియు మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అలాగే మండల స్థాయి హౌసింగ్ ఇంజనీర్లు నిర్మాణపనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులకు తెలిపారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

## నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి శిక్షణ

**గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ అనిల్ కుమార్**

**వనపర్తి రూరల్,మే9,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ అనిల్ కుమార్ శనివారం వెల్లడించారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా వివిధ వృత్తి ఆధారిత ఉచిత శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతకు ఉపాధి దిశగా మార్గనిర్దేశం చేస్తోంది. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, కనీసం పదో తరగతి అర్హత ఉన్న అభ్యర్థులు ఈ శిక్షణలకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ కాలమంతా అభ్యర్థులకు ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఆయా రంగాల్లో స్వయం ఉపాధి ప్రారంభించేందుకు అవసరమైన సలహాలు, మార్గదర్శకంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ముద్రా పథకం ద్వారా రుణాలు పొందేందుకు అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం మగ్గం వర్క్ కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా కోర్సులు యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. సంస్థలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాల్లో అనేక కోర్సులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. గ్రామీణ యువతీ, యువకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు వనపర్తి మెడికల్ కాలేజ్ ఎదురుగా ఉన్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో సంప్రదించి వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి ఎంపీ డికె అరుణ పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్, మే 9 ప్రభాతవార్త :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బీజేపీ కార్యకర్త మహేష్ కుటుంబ సభ్యులను మహబూబ్‌నగర్ పట్టణం బీ.కే రెడ్డి కాలనీలోని వారి నివాసానికి వెళ్లి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పరామర్శించారు. మహేష్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఎంపీ డీకే అరుణ ప్రార్థించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## వెల్టూరు స్టేజి వద్ద శాశ్వత బస్టాప్

**ఆర్టీసీ అధికారుల, ఎంపీ ఎమ్మెల్యే సహకారంతో సాధించుకున్న బస్ స్టాప్**



వెల్టూర్ స్టేజి వద్ద శాశ్వత బస్టాప్ ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీని కోరుతున్న వెల్టూరు గ్రామస్తులు

**ఉప్పునుంతల, మే 9 ప్రభాతవార్త :** అచ్చంపేట నుంచి డిండి మీదుగా హైదరాబాద్ కు వెళ్లే జాతీయ రహదారిలో ఉన్న వెల్టూర్ స్టేజ్ వద్ద శాశ్వతంగా ఎక్స్‌ప్రె బస్సులు ఆపాలని ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్న ప్రయత్నం నేటికీ దక్కిందని గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ పేర్కొన్నారు. గతంలో ఎన్నోసార్లు పోరాటం చేసిన ఫలితం దక్కక పోవడంతో ఇటీవల అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి, ఆర్టీసీ మహబూబ్ నగర్ రీజినల్ మేనేజర్ దృష్టి తీసుకెళ్లగా వారు స్పందించి శ్రీశైలం, హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న వెల్టూరు స్టేజి వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా.మల్లు రవి, ఆర్టీసీ ఆర్ఎం సూచనల మేరకు అచ్చంపేట ఆర్టిసి అధికారులు వెల్టూరు స్టేజ్ వద్ద శాశ్వతంగా బస్టాప్ ఏర్పాటు చేశారు. వెల్టూరు స్టేజి వద్ద బస్టాప్ కు కృషి చేసిన అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి, ఆర్టీసీ అధికారులకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఆర్టీసీ అధికారుల కు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి కి విన్నవించుకున్న వారిలో గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్, ఉప సర్పంచ్ ఉప్పరి మల్లయ్య, వార్డు సభ్యులు బూరం నరేష్ యాదవ్, సుంకరి మోనిక నాగరాజు, ఉప్పరి బాలరాజు, నాగార్జున గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే సతీమణి కవిత



లబ్ధిదారులైన దంపతులకు నూతన వస్త్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవిత

**భూత్పూర్,మే 9,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం కొత్తమొల్గర,భట్టుపల్లి గ్రామాలలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను దేవరకద్ర ఎమ్మెల్యే సతీమణి కవిత శనివారం ప్రారంభించారు. కాంగ్రెస్ కార్యకర్త గంగాధర్ మాత్రు మూర్తి అనారోగ్యంతో మరణించారు. వారి ఇంటిని సందర్శించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తమొల్గర సర్పంచి మలిశెట్టి వెంకటేష్,భట్టుపల్లి సర్పంచి లక్ష్మమ్మలతో పాటు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతి రెడ్డితో పాటు పార్టీ సీనియర్ నాయకుడు రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి పండుగ ఉత్సవాలకు హాజరైన మాజీ మంత్రి



బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**గోపాల్ పేట,మే 9 ప్రభాతవార్త :** గోపాల్‌పేట్ మండలం బుద్దారం గ్రామంలో గ్రామ సర్పంచ్ పలుస శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించిన నాభిశిల బొడ్రాయి దేవతా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు, హోమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ మంత్రి పాల్గొని దేవతలకు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. గ్రామ ప్రజలు సుఖశాంతులతో, పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని దేవతలను ప్రార్థించారు. అనంతరం గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు మాజీ మంత్రికి ఘన స్వాగతం పలుకగా, బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ ఐక్యతకు ప్రతీకలని మాజీ మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుస శంకర్ గౌడ్, బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇసుక రవాణాపై పోలీసుల చర్యలు

**రెండు ట్రాక్టర్లు పట్టివేత : ఎస్పై రమేష్**



అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

**నారాయణపేట, మే 9 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్పై రమేష్ తెలిపారు. పగిడిమర్రి శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ట్రాక్టర్ నంబర్లు ఏపీ 22 టిఏ 0625, టీఎస్06యూసీ 6283లను ఆపి తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్లు పెద్ద హరికృష్ణ (పగిడిమర్రి), కావలి సరూల్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పై తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వేసవి శిబిరం



జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి

**ఉప్పునుంతల, మే 9 ప్రభాతవార్త :** పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పునుంతలలో రేపటి నుంచి ఈ నెల 25 వరకు ఉచిత వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు పి యం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 6 వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థు లకు సమ్మర్ క్యాంపులో అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నా రు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు. మండలం లోని వివిధ పాఠశాలలకు చెందిన 6 నుంచి 9 వ తరగతి చదువు తున్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం పరచుకోవాలని ఆయ న కోరారు. సమ్మర్ క్యాంపులో మొదటగా వచ్చిన 100 మందికి మాత్రం ప్రాధాన్యత ఉంటుందని ఆయన వివరించారు. ఈ శిబిరం లో కంప్యూటర్ విద్యపై ప్రత్యేక శిక్షణతో పాటు సృజనాత్మకత, లైఫ్ స్కిల్స్, ఇండోర్ గేమ్స్, స్టోరీ టెల్లింగ్, కుట్లు అల్లికలు, భారతీయ భాష ఉత్సవాలు, క్విజ్, చెస్ పోటీలు నిర్వహించబడతాయని ఆయన గురించి. ఈ శిబిరంలో పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా తమ తల్లిదండ్రుల అంగీకార పత్రంతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు. స్థానిక సాంప్రదాయక ఆటలను ప్రోత్సహిస్తూనే ఆధునిక సాంకేతిక పై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన అన్నారు. మండలంలోని విద్యార్థులు అవకాశాలు సద్వినియోగ చేసుకోవాలని రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు కోరారు.

## ధన్వాడలో తాగునీటి సంక్షోభం - మిషన్ భగీరథ అధికారులు ఎక్కడ?

**15 రోజుల్లో సమస్య పరిష్కారం అంటూ హామీ**

**నెల గడిచినా ఫలితం శూన్యం**

**ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**



నీటి సమస్య గురించి ధన్వాడలో అడిగి తెలుసుకుంటున్న అధికారులు

**ధన్వాడ, మే 9 ప్రభాతవార్త :** ఎండాకాలం తీవ్రత పెరుగుతున్న వేళ ధన్వాడ మండలంలో తాగునీటి సమస్య రోజురోజుకీ తీవ్రమవుతోంది. మిషన్ భగీరథ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులు ఎక్కడ నీటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ధన్వాడలో మాత్రం పరిస్థితి మారలేదు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పదో వార్డులో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సమస్యపై పలుమార్లు గ్రామపంచాయతీ సమావేశాల్లో తీర్మానాలు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత నెలలో మిషన్ భగీరథ అధికారులు సమస్య ఉన్న ప్రాంతాన్ని సందర్శించి, 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం" అంటూ ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే నెల రోజులు గడిచినా సమస్య యథాతథంగానే కొనసాగుతోంది. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "అధికారులు హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేయడం లేదు" అని మండిపడుతున్నారు. పత్రికల్లో వార్తలు వచ్చినా స్పందన లేకపోవడం, ప్రజల విన్నపాలను పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాగునీటి సమస్య పరిష్కారంలో ముందుండాల్సిన అధికారులు, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా దూరంగా ఉండడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మిషన్ భగీరథ అధికారులు గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు గానీ కనిపించకపోవడంతో "అధికారులు ఉన్నారా? సర్పంచ్ ఉన్నారా?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి




సిఐటియు ఆధ్వర్యంలో మేడే నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ మే 9, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్యన్ రమేష్ సీనియర్ నాయకులు మహమూద్ తదితరులు విజ్ఞప్తి చేశారు. శనివారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు సంబంధించిన 24 లేబర్ కోడ్లను రద్దుచేసి కేవలం నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడం మూలంగా కార్మికుల ఉద్యోగ భద్రతకు రక్షణ లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటితరంగా కార్మికులకు నెలకు 24 వేల రూపాయల వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం అమలు చేయకుండా కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారుతీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడమే కాకుండా సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అంతకుముందుగా మేడే సందర్భంగా సిఐటియు జెండా ఆవిష్కరణ గావించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ రాజు, బుచ్చన్న, భారతీయుడు తదితరులతో పాటుగా పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## యువ క్రీడాకారులకు అండగా కిరణ్ గౌడ్


ఫుట్‌బాల్ ప్లేయర్లకు షూ అందజేసిన దృశ్యం

**మద్దూరు, మే9 ప్రభాతవార్త:** మద్దూరు జడ్పీహెచ్ఎస్ బాలుర హైస్కూల్ లో నిర్వహిస్తున్న సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంపులో పాల్గొంటున్న క్రీడాకారులకు బీజేపీ యువ మోర్చా నాయకుడు కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో షూలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వ్యాపారవేత్తఆలంపల్లి కార్తికేయ సహకారం అందించారు. ఈ సందర్భంగా కిరణ్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో మంచి క్రీడా ప్రతిభ ఉందని, సరైన ప్రోత్సాహం అందితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్య క్రమంలో తలారి సాయిలు, రఘుచారి, గురుకర్ణ పలువురు యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి



**నారాయణ పేట, మే 9 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా చిన్నపొర్ల గ్రామంలో మేస్త్రీ నర్సింలు నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, సర్పంచ్ గాండ్ల నికిత ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే కొత్తపల్లి నీలమ్మ, కొత్తపల్లి బసవరాజ్‌లకు, ఇందిరమ్మ ఇండ్ల ప్రెసిడెంట్ పేపర్లు అందజేసి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, వార్డ్ మెంబర్లు బందే నమాజ్, గ్రామస్తులు చిన్న కోట్ల సంజప్ప, చెన్నకేశవులు, దరువు రఫీ, బాలరాజు, పుల శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు 12 వేల జీవన భృతి అమలు చేయాలి

**ఆత్మకూర్ మే 9, ప్రభాతవార్త:** దేశవాపితంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీ పథకంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి 12,000జీవన భృతిని తక్షణమే అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆత్మ కూరు మండలంలోని కత్తెపల్లి, మేడేపల్లి, ఆరేపల్లి, తూంపల్లి, బోట్లంపల్లి తదితర గ్రామాలలో ఉపాధి హామీ పథకం పనులు కొనసాగుతున్న ప్రదేశాలకు వెళ్లి కూలీలతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తుందని ఈ విషయంపై కూలీలు కలిసికట్టుగా పోరాడి పథకాన్ని కొనసాగించేందుకు ఉద్యమించాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానం చేసిచెక్ డ్యామ్ నిర్వ హణలో, గ్రామాలలో పరిశుద్ధ పనులు కొనసాగించేందుకు చట్టం చేయాలని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఉపాధి కూలీ పథకంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి రోజుకు 600 రూపాయల వేతనం చెల్లించాలని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా సంవత్సరానికి ప్రతి ఒక్క ఉపాధి కూలీకి 12,000 చెల్లించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుత వేసవి కాలంలో ఉపాధి హామీ పథకం పరలో కొనసాగుతున్న ప్రదేశాలలో కూలీలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించడమే కాకుండా మంచినీటి వసతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి కూలీలకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ఉపాధి హామీ కూలీలతో పాటుగా అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం నాయకులు రాజు వెంకటేష్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశానికి హాజరైన వనపర్తి ఎమ్మెల్యే


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి దంపతులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పెద్దమందడి, మే 9 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దొడగుంటపల్లి గ్రామంలో శనివారం గ్రామపంచాయతీ సభ్యులు వెంకటయ్య ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరై ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి వారిని ఆశీర్వదించారు. వారి వెంట గ్రామ సర్పంచ్ కొమ్ము పెంటయ్య, కాంగ్రెస్ నాయకులు కొత్త కాపు వెంకటేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ చౌదర్పల్లి ఆంజనేయ స్వామి దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన

**పెద్దమందడి, మే9 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ చౌదర్పల్లి ఆంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన, సీతారాముల విగ్రహ ప్రతిష్టకు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి ఆహ్వాన పత్రికను ఆంజనేయ స్వామి కమిటీ సభ్యులు అనిల్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు నరేష్, యూత్ అధ్యక్షులు ఆదిత్య, రాఘవేందర్ అందజేశారు. ఈనెల 13వ తేదీన మన జిల్లా శివారులో ఉన్న ఆంజనేయస్వామి ధ్వజస్తంభం ప్రతిష్ట అంగరంగ వైభవంగా సీతారామ సీతారాముల విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



### రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా

# వరి ధాన్యం కొనుగోలు చేయాలి

● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**గోపాల్ పేట, మే 9 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండలంలోని నర్సింగాయిపల్లి గ్రామంలో ఉన్న మెప్మా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, రికార్డులు, ధాన్యం నమోదు రిజిస్టర్లను తనిఖీ చేశారు. రైతులకు కేంద్రంలో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అలాగే ధాన్యం తూకం, తరలింపు, చెల్లింపుల ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంఛార్జిలకు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యంలో తాలు, గడ్డి లేకుండా క్లీన్ చేసుకునే విధంగా రైతులకు తెలియజేయాలని సూచించారు. ప్యాడి క్లీనర్లను వినియోగించి ధాన్యాన్ని తాలు లేకుండా క్లీన్ చేయాలని రైతులకు తెలియజేశారు. అకాల వర్షాలు సంభవిస్తే రైతులకు ఇబ్బంది కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు దాన్యంతెచ్చిన వారికి తెచ్చినట్లుగా తూకంచేసి కేటాయించిన మిల్లుకు తరలించాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. డిసిఎస్ఓ కాశీవిశ్వనాథ్, ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ప్రతి గింజాను కొనుగోలు చేస్తాం

◆ రైతన్నకు అండగా ఉండి ఆదుకుంటాం..

◆ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి


వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**వంగూరు, మే 9 ప్రభాతవార్త:** రైతన్న పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండి గిట్టుబాటు ధరను కల్పించి ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి పేర్కొన్నారు. వంగూరు మండలంలోని తిప్పారెడ్డి పల్లి, నిజాంబాద్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పండిత్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీమ్ముల రాజశేఖర్‌రెడ్డి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు నార్మధ జనార్దన్‌లు పాల్గొని ప్రారంభించారు. అనంతరం కెవిఎన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన కొను గోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి గిట్టుబాటు ధరను పొంది అభి వృద్ధి చెందాలని ఆయన సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యాన్ని విక్రయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల కృష్ణారెడ్డి, శంకర్‌యాదవ్, మండల నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మరో మారు బీడీ కూలీ పెంపు చర్చలు విఫలం


బీడీ కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతున్న బీడీ యాజమాన్యాలు

**చిన్న చింతకుంట, మే9 ప్రభాతవార్త:** పెరిగిన ధరలకు అనుగుణంగా బీడీ కూలి పెంచాలని బీడీ యాజమాన్యాలకు బీడీ కార్మిక సంఘాలు డిమాండ్ నోటీసులను అందజేసి చర్చలు కొనసాగాయి. ఏప్రిల్ 18న మొదటిసారి జిల్లా కేంద్రంలో బీడీ యజమాన్యాలతో బీడీ కార్మిక సంఘాలు చర్చలు విఫలమయ్యాయి. శనివారం మరో మారు జిల్లా కేంద్రంలో బీడీ యజమాన్యాలతో బీడీ కార్మిక సంఘాల నేతలు చర్చలు జరిపారు. బీడీ యజమాన్యం ప్రస్తుతం ఇస్తున్న బీడీ కూలి రూ.230 రూపాయలకురూ. 10 రూపాయలను కలిపి రూ.240 పెంచుతామని ప్రతిపాదన తీసుకొచ్చారని కార్మిక సంఘాల నేతలు తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బీడీ కూలి పెంచకపోవడం దారుణమని బీడీ కార్మిక సంఘాల నేతలు తిరస్కరించారు. బీడీ యజమాన్యాల ప్రతిపాదనను కార్మిక సంఘాల నేతలు తోసిపిచ్చారు .ఈనెల 21న మరో మారు బీడీ కూలి పెంపుపై చర్చలలో బీడీ కూలి పెంచే విధంగా బీడీ యజమాన్యాలు సమిష్టిగా నిర్ణయించి చర్చల్లో పాల్గొనాలని కార్మిక సంఘాల నేతలు కోరారు. లేనిపక్షంలో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ చర్చల్లో బీడీ యజమాన్యాలు విష్ణువర్ధన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సోహెల్ సెట్, జియా సెట్ లతోపాటు కార్మిక సంఘాల నేతలు తెలంగాణప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నేతలు కె. సూర్యం, కొండన్న, దేవదానం, అరుణ్ కుమార్, సిఐటియు నేతలు మహమూద్, వేణుగోపాల్, ఏఐటీయూసీ నాయకులు శ్యాంసుందర్, రాబర్ట్, వెంకటేష్, టిఎఫ్‌టియు నాయకులు యాదగిరి, విజయ్ కుమార్, టిఆర్ఎస్కెవి నాయకులు అబ్రహం పాల్గొన్నారు.

# జాతీయ మహాసభలను జయప్రదం చేయండి


జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**దామరగిద్ద, మే 9 ప్రభాతవార్త:** అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ మహాసభలు ఈ నెల 11, 12, 13 తేదీలలో భద్రాద్రి కొత్త గూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ మహాసభలకు రైతులు, రైతు కూలీలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఉడ్మల్‌గిద్ద గ్రామంలో సభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణ, జిల్లా నాయకులు పెద్దింటి తాయప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే విధంగా రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. రైతులకు కనీస మద్దతు ధరలు లేకపోవడం, పెట్టుబడుల కోసం తీసుకున్న అప్పులు తీర్చలేక అనేక మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని, బడా కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రుణమాఫీలు చేస్తున్నప్పటికీ రైతులపై మాత్రం బ్యాంకులఒత్తిడి కొనసాగుతోందని అన్నారు. రైతులను ఆదుకునే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు అమలు చేయాలని, లేదంటే ఈ మహాసభల ద్వారా దేశవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. రైతుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం జరిగే జాతీయ మహాసభ నిర్ణయాల్లో రైతులు, రైతు కూలీలు, ప్రజలు పెద్దసంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి పి. మధు, జిల్లా నాయకులు టి. మహేష్, యం. రాజు, మదర్, గోపాల్, బాషాసాబ్, హనుమంతు, యన్. బాలప్ప, తలారి నర్సింలు, యం. గోవిందు, వెంకటప్ప, మాల నర్సింలు, లడ్డి బాలప్ప, తలారి శామమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

**నారాయణపేట, మే 9 ప్రభాతవార్త:** నారాయణపేట మండల పరిధిలోని కోటకొండ గ్రామ శివారులో శనివారం ఉపాధి హామీ పథక పనులను సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండమీది బలరాం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెగారి దస్తప్ప పరిశీలించారు ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చడమే కాకుండా, నిధులను కూడా తగ్గిస్తూ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్‌ల ఆలోచనలు కేంద్ర పాలకులకు నచ్చడం లేదని ఆరోపించారు. గతంలో ఉపాధిహామీ పథకానికి 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం భరించేదని, ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేవలం 60 శాతం మాత్రమే భరించి, మిగతా 40శాతం భారం రాష్ట్ర ప్రభుత్వాలపై మోపుతోందని తెలిపారు. కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఫేస్‌క్యాప్చరింగ్ విధానాన్నిరోజుకు రెండుపూటలు అమలు చేయడం కార్మికులకు ఇబ్బందికరంగా మారిందని, వెంటనే ఆ విధానాన్ని రద్దు చేయాలని కోరారు ఎండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు తమ సంఘాల ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేసి, డీహైడ్రేషన్ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు చుక్క గోవిందు, గోటూరు మల్లేష్, క్షేత్రసహాయకుల సంఘం జిల్లా నాయకులు డి.కృష్ణయ్య పాల్గొన్నారు. ఉపాధి కూలీలు చెవుల భగవంతుడు, ఎదిరింటి భగవంతు, చెవుల నరేష్, బల్ల దస్తప్ప, కూర వెంకటప్ప హాజరయ్యారు.

# రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు ఎంపికైన కొల్లాపూర్ విద్యార్థి


విద్యార్థినిని శాలువాతో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**కొల్లాపూర్, మే 9 ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయి క్రీడ పాఠశాలలకు నాగర్‌కర్నూల్ జిల్లా నుండి ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం జరి గింది. అందులో ముగ్గురు బాలికలు ముగ్గురు బాలురు ఎంపికయ్యారు. వివిధ క్రీడా పాఠశాలలలో నాలుగో తరగతి ప్రవేశం కొరకు 30.04.2026, 01.05.2026 తేదీలలో హకీంపేట్ లో నిర్వహించబడిన రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలల ఎంపికలో మన నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ముక్కిడి గుండం గ్రామంలో నుండి సభావాత్ చరణ్ కుమార్ తండ్రి దశరథం అను విద్యార్థి ఎంపిక అయ్యాడు. ఈ విద్యార్థినిని ఎంఇఓ.ఇమ్మానుయేలు స్టేడియం గ్రౌండ్ ఇన్చార్జి సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో ఘనంగా శాలువతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ ఈ విద్యార్థి క్రీడా పాఠశాలకు ఎన్నిక కావడం గొప్ప సంతో షకరంగా ఉందని అక్కడి విద్యార్థులు నిర్దేశించి మీరు కూడా ఆటల పోటీలలో రాణించి మంచి నైపుణ్యంతో నేర్చుకోని ఈ విద్యార్థి వలె స్పోర్ట్స్‌స్కూల్లో సీటు సంపాదించాలన్నారు. రాష్ట్రం తరఫున దేశంతరఫున, ఆడుతూ మనకొల్లాపూర్ యొక్క విశిష్టత, మంచి పేరు, ప్రఖ్యాతులు తేవాలనీ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, పేరెంట్స్, రంగినేని శ్రీధర్ పిడి, అల్వాల అర్జున్ గౌడ్ యోగా అధ్యక్షులు, రిటైర్డ్ పీఈటి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


గోశాలకు వరి గడ్డిని విరాళంగా అందజేస్తున్న రైతులు

## మానవత్వాన్ని చాటుకున్న రైతులు

గోశాలకు10 ఎకరాల వరి గడ్డి విరాళం

**దామరగిద్ద, మే 9 ప్రభాతవార్త:** మూగజీవుల ఆకలి తీర్చేందుకు రైతులు పెద్ద మనసుతో ముందుకు వస్తున్నారు. దామరగిద్ద మండలం మొగల్‌మడ్క గ్రామానికి చెందిన రైతులు కురువ శామప్ప, కురువ సాయప్ప తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆశన్‌పల్లి గ్రామంలోని శివశక్తి పీఠం గోశాలలో పశువుల మేత కోసం తమ 10 ఎకరాల పొలంలోని వరి గడ్డిని విరాళంగా అందజేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. ఈ గడ్డిని గోశాల నిర్వాహకుడు నారాయణ స్వామికి అందజేశారు. సోషల్ మీడియాలో గోశాలలో మేత కొరతపై వచ్చిన సమాచారాన్ని చూసి స్పందించిన రైతులుఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, మేత లేక పశువులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మా పొలంలోని వరి గడ్డిని గోశాలకు ఇస్తున్నాం. మూగజీవుల సేవలో భాగం కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఇతర రైతులు కూడా తమకు తోచినవిధంగా గోశాలలకు సహాయం చేయాలి అని కోరారు. గోశాల నిర్వాహకుడు నారాయణ స్వామి మాట్లాడుతూ మొగల్‌మడ్క గ్రామానికి చెందిన కురువ శామప్ప, కురువ సాయప్ప దాదాపు 10ఎకరాల వరి గడ్డిని విరాళంగా ఇచ్చి గొప్ప మనసును చాటుకున్నారు. మేత కొరత ఉన్న సమయంలో వారు చేసిన సహాయం అభినందనీయం. ఇలాంటి దాతృత్వంతో ముందుకు వచ్చినరైతులకు గోశాలతరఫున, గ్రామస్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాము. త్వరలోనే వారిని ఘనంగా సన్మానిస్తాము" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు, గ్రామస్థులు పాల్గొని దాతల సేవా భావాన్ని కొనియాడారు.

## ప్రమాద భరితంగా కల్వర్టు

ఆదమరిస్తే అనంతలోకానికే



**అచ్చంపేట, మే,9 ప్రభాతవార్త:** అచ్చంపేట నుండి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి నడింపల్లి శివారులోని కల్వర్టు ప్రమాద భరితంగా ఉన్నా ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనునిత్యం అచ్చంపేట నుండి హైదరాబాద్‌కు వందల వాహనాలు వెళుతుంటాయి. ఆదమరిస్తే ప్రాణాలుగాల్లో కలవక తప్పదని వాహన దారులు మాట్లాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ కల్వర్టుకు సూచిక బోర్డు కానీ ఇరువైపుల భద్రత ఏర్పాట్లు గాని చెయ్యాలని కోరుతున్నారు.

## నిరుపేదలకు వరం ఇందిరమ్మ ఇండ్లు

ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో దుశ్యంత్ రెడ్డి


ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన దుశ్యంత్‌రెడ్డి

**నవాబుపేట, మే 9 ప్రభాతవార్త:** నిరు పేదలకు వరంగా ఇందిరమ్మ ఇండ్లు నిలుస్తున్నాయని మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుశ్యంత్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కిషన్ గూడ గ్రామపంచాయతీ గుబ్బడిగుచ్చ తండాలో నూతనంగా నిర్మించిన భదావత్‌గౌరీ బాయ్ ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరమని, ప్రతి అర్హత గల కుటుంబానికి సొంత ఇల్లు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జనంపల్లి దుష్యంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లల్లీబాయ్ ప్రేమ్, మార్కెట్ కమిటీ చైర్మన్ హరలింగం, మాజీ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసు యాదవ్, గురుకుంట రవీందర్ రెడ్డి, కారుకొండ సర్పంచ్ సురేష్, చిర్ర సత్యం, కాకర్జాల సర్పంచ్ ముడావత్ సంతోష్, పోమాల్ సర్పంచ్ కవిత నరేష్, కిషన్ గూడ గ్రామ పార్టీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ధన్వాడ, మరికల్‌లో వరి కొనుగోలు కేంద్రాల పరిశీలన

- రైతులకు అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశం

**ధన్వాడ, మే 9 ప్రభాతవార్త :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ధన్వాడ మండలంలోని మందిపల్లి, అప్పంపల్లి గ్రామాలు అలాగే మరికల్ మండలంలోని తీలేరు గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా సకాలంలో రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కేంద్రాల్లో సేకరించిన ధాన్యం బస్తాలను భద్రంగా నిల్వ చేయడానికి షెడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతులకు త్రాగునీరు, అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. కేంద్రాలనిర్వహణలో టార్పాలిన్ల లభ్యత, హమాలీల అందుబాటు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. గన్నీ బస్తాలు లేదాఇతర అవసరమైన సామాగ్రి లోపం ఉంటే వెంటనే సమకూర్చాలని కొనుగోలు కేంద్రాల ఇంఛార్జ్‌లను ఆదేశించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం విక్రయించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.


కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

## వైభవంగా పోచమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం

### ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్ గుమ్మాల్ మమతా శ్రీనివాస్



**మహబూబ్‌నగర్, మే 9 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణంలోని 3వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయాన్ని మేయర్ తన సొంత నిధులతో నిర్మించడం విశేషం. భక్తిశ్రద్ధలతో ఆలయ పునర్నిర్మాణం చేయించారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు సభ్యులు మేయర్‌ను ఆహ్వానించి, పట్టు వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. అమ్మవారి ఆశీస్సులు మేయర్ పై ఎల్లవేళలా ఉండాలని వారు ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం మేయర్ ఎటువంటి తేడా లేకుండా వార్డు సభ్యులు, స్థానిక ప్రజలతో కలిసి భోజనం చేశారు. ప్రజల మధ్యలో ఉంటూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ తో పాటు స్థానిక నాయకులు, వార్డు ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ, ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగడం సంతోషకరమని మేయర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



పోచమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవాల్లో పాల్గొన్న మేయర్ గుమ్మాల్ మమతా శ్రీనివాస్

## రుచి కోసం.. ప్రాణాలు పణం



- టెస్టింగ్ సాల్టుతో ముంచుకొస్తున్న అనారోగ్యం
- వాడొద్దని వైద్య నిపుణుల హెచ్చరిక
- పర్యవేక్షించని ఫుడ్ సేఫ్టీ అధికారులు




విచ్చలవిడిగా దేవరకద్ర నియోజకవర్గంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు

**దేవరకద్ర, మే9 ప్రభాతవార్త:** నేటి ఉరుకు పరుగుల జీవితంలో ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి పెరిగిపోయింది. పట్టణాల నుంచి గ్రామాల వరకు రోడ్ల పక్కన వెలసిన నూడుల్స్, ఫ్రైడ్‌రైస్, మంచూరియా వంటి పదార్థాలకు ప్రజలు తీవ్రంగా అలవాటు పడ్డారు. ఈ క్రమంలో కేవలం రుచికోసం వాడుతున్న టెస్టింగ్ సాల్ట్ (మోనో సోడియం గ్లూటా మేట్) ప్రజల ఆరోగ్యానికి తీరని నష్టం చేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్నారి నుంచి వృద్ధుడి వరకు అందరూ బాధితులే. టెస్టింగ్ సాల్ట్ గతంలో ఎప్పుడో ఒకసారి మాత్రమే తినే ఫాస్ట్ ఫుడ్ ఇప్పుడు నిత్యకృత్యంగా మారిపోయింది. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు కూడా ఈ అలవాటు చేస్తున్నారు. ఈ పదార్థాలలో వాడే టెస్టింగ్ స్టాల్స్ నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపు తోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. దీన్ని నిరంతరం తీసుకోవడం వల్ల మైగ్రేన్ తలనొప్పి విపరీతమైన అలసట గుండె సంబంధిత సమస్యలు తలెత్తుతాయని చెప్తున్నారు.



**గర్భిణీలు, పిల్లలకు పెను ప్రమాదం..**

గర్భిణీలు,చిన్నపిల్లలు ఈ రసాయనం కలిపిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. రుచి కోసం ఆరోగ్యాన్ని పణంగా పెట్టవద్దని, ఇంటి వద్ద తయారు చేసుకునే సహజసిద్ధమైన ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరుతున్నారు. విచ్చలవిడిగా వెలుస్తున్న హోటల్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఆహార నాణ్యతను పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రుచికోసం హానికరమైన రసాయనాలు వాడుతున్న కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**విచ్చలవిడిగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు...**

దేవరకద్ర నియోజకవర్గ వ్యాప్తంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు పుట్ట గొడుగుల వెలుతున్నాయి. నాణ్యత ప్రమాణాలు గాలికి వదిలేసి నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లపై, ఫుడ్ సేఫ్టీ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఎక్కడ చూసినా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో ఎక్కువ అవడంతో ప్రజలు ఆకర్షితులు అవుతూ, ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వరకు నిర్వహించనున్న విద్యాశాఖ వారోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. వారోత్సవాల్లో ప్రతిరోజు నిర్దేశించిన విధంగా రోజువారి కార్యక్రమాలను చేపట్టి ప్రజాప్రతినిధులను అందులో భాగస్వామ్యం చేయాలని తెలియజేశారు. వీసీ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్ కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు 10,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు పడితే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా ధాన్యం నిల్వ చేయడానికి గొడౌన్లను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిప్రతిరోజు నివేదిక అందించాలని సూచించారు. అదేవిధంగా ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు ఏం లేకుండా చూడాలని ఆదేశించారు.మే11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా విద్యాసంస్థల్లో పనుల శంకుస్థాపనలు, ఎస్ఎస్ సి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థుల ఉత్తీర్ణత కోసం ప్రత్యేక విద్య శిబిరాల నిర్వహణ, వర్క్ షాప్‌ల ఏర్పాటు, జయశంకర్‌బడిబాట కార్యక్రమం, పోషకుల సమావేశాలు, లైబ్రరీ డే, విద్యా వేడుకల కార్యక్రమాలు నిర్ణిత ప్రణాళిక ప్రకారం రోజువారి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యా శాఖలో చేపడుతున్న కార్యక్రమాలపై అన్ని గ్రామాల సర్పంచులకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో సిపిఓ హరికృష్ణ, డిసిఎస్‌ఓ కాశీ విశ్వనాథ్, డిఎం ఆంజనేయులు, డీఏవో ఆంజనేయులు, డిడబ్ల్యుఓ సుధారాణి, విద్యాశాఖ సిబ్బంది, ఇతరఅధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం రవాణా టెండర్లలో భారీ స్కాం

(మొదటి పేజీ తరువాయి)

తిరగకపోవడంఅధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా చెప్పవచ్చన్నారు. వాటికి జీపీఎస్ సిస్టం అమర్చి మార్కెట్లో తిప్పాలి.. కాని టెండర్లలో చూపించిన వాహనాలు లేకపోవడంతో నేడు ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోయింది. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద, కల్లాల వద్ద ఎక్కడి ధాన్యం అక్కడ నిలిచిపోయిందన్నారు. అధికారులు దీనిపైన ఎందుకు ఎంక్వయిరీ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ విషయమై లారీ అసోసియేషన్ వారిని పలకరిస్తే గత ఏడాది బిల్లులే ఇంతవరకు ఇవ్వలేదు.. ఆ కంట్రాక్టర్లు ఎవరో తమ బిల్లులు ఎప్పుడు వస్తాయో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. జిల్లా కలెక్టరు వెంటనే లారీ కాంట్రాక్టర్లను, సివిల్ సప్లయ్, ఆర్టీఏ, సంబంధిత అధికారులతో మాట్లాడి టెండర్లలో ఏవైతే వాహనాలు చూపించారో ఆ వాహనాలు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వివిగౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, నాయకులు రమేష్, యశ్వంత్, మ్యాదరి రాజు పాల్గొన్నారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయొద్దు

- యూత్ కాంగ్రెస్ దేవరకద్ర నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ కుమ్మరి బుచ్చన్న



**దేవరకద్ర, మే 9 ప్రభాతవార్త:** వరి ధాన్యాల అంశంపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని యూత్ కాంగ్రెస్ దేవరకద్ర నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ కుమ్మరి బుచ్చన్న అన్నారు. శనివారం గోపన్ పల్లి గ్రామంలో వరి ధాన్యాలు పోసిన రైతుల దగ్గరికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి వచ్చి అనవసరపు మాటలు మాట్లాడి, తప్పుడు అబద్ధాలు మాట్లాడడంసమంజసం కాదన్నారు. రైతుల సమస్యలు ఎంతో సున్నితమైనవని, వాటిపై రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలు చేయడం ప్రజలను గందరగోళానికి గురి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ, ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తుందని తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి గత 15 రోజుల కిందట గోపన్ పల్లి గ్రామానికి విచ్చేసి, వరి కొనుగోలు సెంటర్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆ రోజు నుండి మా గ్రామంలో సుమారుగా 10,000 వేల బస్తాలు మిల్లుకు పోవడం జరుగుతుందన్నారు. మా ప్రజా ప్రభుత్వం, మా కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ, కానీ ప్రతిపక్షాలు కావాలని రాద్ధాంతం చేస్తూ నిందలు మోపుతున్నాయి. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నిరంతరం అందుబాటులో ఉండి, ఫోన్ చేసినా వెంటనే స్పందించి, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి, సమస్యలను వెంటనే తీర్చడం జరుగుతుందన్నారు. గోపన్ పల్లి గ్రామంలో కొందరు రైతులు నూతన డాన్ సీడ్ వడ్లు రాజేందర్ నగర్ నుండి తెచ్చి పంట పండించడంతో ఆ డాన్ సీడ్‌ఉండాల్సి న తాల్ కన్నాఎక్కువగా ఉండడంతో రైస్ మిల్లర్ వాళ్ళు కొనుగోలు చేయలేకపోతున్నారు. 40 కేజీల బ్యాగు నింపితే 35 కిలోలు వస్తున్నాయి. అంటే ఆలోచించండి క్వింటాల్ 14 కిలోలు తరుగు తీయడం అంటే డాన్‌సీడ్ వేసినారైతులే మిల్లర్ల దగ్గరికి ఒప్పుకొని రావడం జరిగిందన్నారు. దానికి మా ఎమ్మెల్యేకు, మా ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. గత బిఆర్ఎస్‌పాలనలో వర్షాలు పడి వడ్లు కొనుగోలు చేయక మొలకలు వచ్చిన రోజులు ఉన్నాయి. కావున ప్రభుత్వంపై, మా ఎమ్మెల్యే పై బురద జల్లడం మానుకోవాలన్నారు. పక్కఊరు డోకూరు, గుడిబండ, నుండి రైతులను తెచ్చుకొని ధర్నా చేశారు. ధర్నాలో గోపన్ పల్లి రైతులే లేరు అంటే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాగోతం ఏంటోఅర్థం అవుతుంది. మా ప్రజా పాలన రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయకుండా నిర్మాణాత్మక సూచనలు చేస్తే స్వాగతిస్తామని, రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని యూత్ కాంగ్రెస్ దేవరకద్ర నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ కుమ్మరి బుచ్చన్న అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డాక్టర్ విజయ్‌కుమార్ మృతి




ప్రమాదానికి గురైన కారు, స్కూల్ బస్సు

(మొదటి పేజీ తరువాయి)

తోటి వైద్యులు తెలిపారు. మృతుడు డాక్టర్ విజయ్‌కుమార్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే వారని అది కాకుండా ప్రయివేటు ఆసుపత్రి ప్రజావైద్యశాలలో పని చేస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలుఅందించారని, చిన్న వయస్సులోనే అకాల మరణం చెందడం చాలాబాధకరమని కల్వకుర్తి వాసులు కన్నీంటి పర్యంతమయ్యారు. ఆసుపత్రి ఆవరణలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



మృతుని కుటుంబబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**హన్వాడ, మే 9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నియోజకవర్గం లోని హన్వాడ మండలంలోని మాదారం గ్రామానికి చెందిన నర్సయ్య యాదమ్మ దంపతుల కుమారుడు లక్కీ మరణించిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ..మహబూబ్ నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ ఎంఎస్ఆర్ వారి అంత్యక్రియలకు ఆర్థిక సాయంగారూ.10 వేలు వారి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, జిల్లా జనరల్ సెక్రటరీ జె.వెంకటయ్య, సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు ఎల్లయ్య, ఉప సర్పంచ్ మంజుల వెంకట్ రెడ్డి, నాగయ్య, గోపి కృష్ణ, భీమయ్యకృష్ణయ్య శ్రీను, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు

- స్వీయ గణనకు ఏర్పాట్లు చేస్తున్నాం
- వీసీలో కలెక్టర్ కుష్బూ గుప్త వెల్లడి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, మే 9 ప్రభాతవార్త:** జన గణన 2027 మే 10 వరకు స్వీయ గణన లో ప్రజలు వివరాలు నమోదు చేసుకునేలా తగు చర్యలు తీసుకుంటామని మహబూబ్నగర్ కలెక్టర్ కుష్బూ గుప్తా తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాలు, విద్యా, వ్యవసాయ శాఖ తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు మే10 వరకు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పౌర సరఫరాలు, విద్యా, వ్యవసాయ శాఖ తదితర అధికారులతో కలిసి విసిలో పాల్గొన్న జిల్లాకలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ జన గణన 2027 మే 10 వరకు స్వీయ గణనలో ప్రజలు వివరాలు నమోదు చేసుకునేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సెస్ పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణా సమావేశాలు నిర్వహించి సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, డిఎస్ఓ గంప శ్రీనివాస్, డిఎం సివిల్ సప్లై రవినాయక్, జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేష్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాదేపల్లి పిఏసిఎస్ చైర్మన్‌గా పాలెం సుదర్శన్ గౌడ్ బాధ్యతలు



పాలెం సుదర్శన్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, మే 9, ప్రభాతవార్త:** బాదేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా పాలెం సుదర్శన్ గౌడ్ శనివారం ఘనంగా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. పాక్స్ వ్యవస్థ రైతులకు అండగా నిలవాలని, పాలెం సుదర్శన్ గౌడ్ నాయకత్వంలో బాదేపల్లి పిఏసిఎస్ రైతులకు మరింత సేవ చేయబోతుంది"అని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో సహకార వ్యవస్థ బలహీనపడిందని విమర్శించారు. ప్రస్తుతం రైతులకు న్యాయం జరిగేలా పారదర్శక వ్యవస్థను తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. పాలెం సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. పిఏసిఎస్ ద్వారా ప్రతి రైతుకు ప్రయోజనం చేకూరేలా పని చేస్తాను" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, మహిళా కార్యకర్తలు, యువ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ సభకు తరలిరండి

**భూత్పూర్, మే9, ప్రభాతవార్త:** ఆదివారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు హైదరాబాద్‌లో పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే దేశ ప్రధానినరేంద్ర మోదీ బహిరంగసభకు భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని బీజేపీ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు గాల్‌రెడ్డి, ఎండి ఫారూఖ్‌లతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు గూటం శ్రీను పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఆదివారం కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో విస్తృతంగా పర్య టిస్తూ కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరు, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారంతో పాటు ప్రజలతో మమేకంగా బహిరంగ సభలు నిర్వహి స్తున్నారని ప్రధానిసభకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

## కంకర రోడ్డే ప్రాణం తీసిందా..?

- ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం
- ఏడాదిగా పూర్తి కాని రోడ్డు పనులపై గ్రామస్తుల ఆగ్రహం



ట్రాక్టర్ బోల్తా పడడంతో మృతి చెందిన రాములు

**మద్దూరు, మే 9 ప్రభాతవార్త:** మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని రేనివట్ల శివారులో శనివారం విషాద ఘటన చోటు చేసుకుంది. ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్ కావలి రాములు (38) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం..అప్పిరెడ్డిపల్లి నుండి రేనివట్ల గ్రామానికి వస్తున్న సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడిపోయింది. ట్రాక్టర్‌కు గడ్డి మోపులు కట్టే యంత్రాన్ని తగిలించుకుని వెళ్తుండగా ప్రమాదవశాత్తూ భారీ టైర్ కింద పడటంతో రాములు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అయితే ఈ ప్రమాదానికి అసలు కారణం నిర్లక్ష్యంగా వదిలేసిన రోడ్డుపనులేనని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్ కంకర వేసి పనులను మధ్యలోనే నిలిపివేశాడని ఆరోపించారు. సుమారు ఏడాది కాలంగాఇదే కంకర రోడ్డుపై వాహనాలు ప్రయాణిస్తున్నాయని, పలుమార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోలేదని మండిపడ్డారు రోడ్డు పనులు పూర్తి చేసి ఉంటే ఓ కుటుంబ పెద్ద ప్రాణం పోయేది కాదు" అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలకు కారణమవుతున్న అసంపూర్తి రోడ్డు పనులపై అధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని కోరారు. మృతుడు రాములుకు భార్య నవనీతతో పాటు ఒక కుమారుడు ఉన్నట్లు సమాచారం. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారి ఇంట విషాదం నెలకొంది.

## మాజీ మంత్రి చొరవతో రైతులకు ఊరట

- మార్కెట్లో ధాన్యం దిగుమతికి అంగీకారం
- జడ్చర్లలో రైతులకు మాజీ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి మద్దతు



**జడ్చర్ల, మే 9 ప్రభాతవార్త:** మాజీ మంత్రి బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి చొరవతో రైతులకు కొంత ఊరట లభించింది. నెల రోజులు గడుస్తున్నా మక్కలు కొనకుండా రైతులను నానా ఇబ్బందులకు గురి చేయడంతో అన్నదాతలు ఒక్కసారిగారోడ్డుపైకి వచ్చి ఆందోళన నిర్వహించారు. శుక్రవారం 40 ట్రాక్టర్ల మొక్కలు సేకరించి గోదాముల్లో స్థలం లేదని కేవలం నాలుగు ట్రాక్టర్లలో ధాన్యాన్ని మాత్రమే దించుకోవడంతో మిగతా రైతులంతా రాత్రి గోదాముల వద్ద జాగరణ చేయాల్సి వచ్చింది. దీంతో ఆగ్రహించిన రైతులు తెల్లవారుజామున జడ్చర్ల లోని జాతీయ రహదారి వద్ద పత్తి మార్కెట్ ఎదురుగా మక్కల లోడుతో నిండిన ట్రాక్టర్లతో ధర్నా నిర్వహించారు. జడ్చర్ల పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి విషయం తెలుసుకుని రైతులవద్దకు చేరుకున్నారు. పత్తి మార్కెట్ ఎదుట రోడ్డు పై బైఠాయించి రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ అధికారి, జడ్చర్ల ఎంఆర్‌ఓ నర్సింగ్‌రావు, రూరల్ సిఐ మహేష్, ఎస్సైలు మల్లేష్, జయ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అల్వాల్‌రెడ్డి రైతుల ధర్నా కార్యక్రమం వద్దకు చేరుకుని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అక్కడే మాజీ మంత్రి డా.సి లక్ష్మారెడ్డి ఎంఆర్‌ఓ నర్సింగ్‌రావు, వ్యవసాయ అధికారితో మాట్లాడారు. నెలలు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో ఏంటని ప్రశ్నించారు. గోదాంలు స్టాక్ పాయింట్లు నిండిపోయాయని చెబుతున్నారని ధాన్యం కొనుగోలు చేసి మార్కెట్ యార్డ్ లో దిగుమతి చేసుకోవాలని మాజీ మంత్రి తో రైతులు పట్టుబట్టారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కారం చేయాలని పేర్కొన్నారు. ధాన్యం ఉన్నా ఖాళీ స్థలంలో దిగుమతి చేయాలని కోరారు. మాజీ మంత్రి మార్కెట్ యార్డులో ధాన్యం దిగుమతి చేసుకోవాలని పట్టుబట్టారు. దీంతో ఉన్న స్థలం లో దిగుమతిచేసుకునేందుకు అధికారులు ఒప్పుకోవడంతో రైతులకు మాజీ మంత్రి డా. సి లక్ష్మారెడ్డి నచ్చజెప్పి ధాన్యం దిగుమతి చేపట్టారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా, ప్రభుత్వం అధికారం యంత్రంగా ముందస్తుగా చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సూచించారు.



రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి

## గత అక్రమాలన్నీ బయటపెడతాం

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



**జడ్చర్ల, మే9, ప్రభాతవార్త:** గతంలో జరిగిన అవినీతి, అక్ర మాలు, కుంభ కోణాలపై పూర్తి వివరాలతో త్వరలోనే ప్రజల ముందుకు వస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి హెచ్చరించారు. జడ్చర్ల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమంలో నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కొంత మంది నాయకులు స్వార్థ రాజకీయాల కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. జడ్చర్ల మార్కెట్‌లో మక్కల కొనుగోలు విషయంలో మాజీ ఎమ్మెల్యేకు చెందిన వ్యక్తి రాజకీయాలు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతుల వద్ద నుంచి మక్కలు కొనుగోలు చేయకుండా అడ్డంకులు సృష్టించి, రైతులను అవమానకరంగా మాట్లాడటం జరిగిందని పేర్కొన్నారు. దీనిపై ఆగ్రహించిన రైతులు రోడ్డు బైఠాయించి ధర్నా నిర్వహించారని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్న మాజీ ఎమ్మెల్యే, ఆ ధర్నాలో కూర్చోవడం సిగ్గుచేటు విషయమని వ్యాఖ్యానించారు. అందుకుగాను వెంటనే మార్కెట్లో విధులు నిర్వహిస్తున్న వ్యక్తిని వెంటనే సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పిఏసిఎస్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**ఖిల్లాగణపురం మే 9, ప్రభాతవార్త:** మండలంలో జరిగిన పలు వివాహ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, దొంతికుంట షాపూర్ గ్రామాలతో పాటు ఇటీవలజరిగిన స్థానిక ఎన్నికలలో సర్పంచ్‌గా ఎన్నికైన రామకృష్ణ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం రెండు రోజుల క్రితం భార్యను కోల్పోయిన టిఆర్ఎస్ రైతు గుంటి సత్తన్న ను ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంబడి మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, మాజీసర్పంచులు మన్యంగౌడ్, సురేందర్, రాళ్ల కృష్ణయ్య, గొడుగు సత్యం, బుచ్చిబాబు గౌడ్, సత్తిరెడ్డి, శివ ,పలువురు బి ఆర్ ఎస్ కార్యకర్తలు ఆయన వెంబడి ఉన్నారు.

**పెద్దమందడి, మే9 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల పరిధిలోని చీకటి చెట్టు తండాలో శనివారం గౌడ్ నాయక్ మాజీ సర్పంచ్ మేనల్లుడు పాత్ర గణేష్ అరుణ వివాహం కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు.